
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 23 మే 2024



కళతప్పిన కళామందిరం - 7లో..
వెల్లివిరిసిన ఆధ్యాత్మికం - 8లో..

'సన్నాల'వైపు మళ్లేనా?



- రూ.500 బోనస్ ప్రకటించిన ప్రభుత్వం
- దొడ్డురకంపై అన్నదాతల మొగ్గు
- జిల్లాలో వానాకాలం సాగు 2.35 లక్షల ఎకరాలు
- వరి 1.83 లక్షల ఎకరాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

యాసంగి సాగులో భూగర్భ జలాలు అడుగంటి ఇబ్బందిపడిన రైతులు వానాకాలం సాగు ఆశాజనకంగా ఉంటుందనే నమ్మకంతో సిద్ధమవుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సుదీర్ఘకాలంగా దొడ్డురకం వడ్లు సాగు చేస్తున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. వానాకాలం సీజన్ నుంచి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సన్నరకం వడ్లకే బోనస్ ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లా రైతులు నిరాశకు గురవుతున్నారు.

ఈ మేరకు దొడ్డురకం వడ్ల నుంచి సన్నరకం సాగుకు మారుతారా? బోనస్ వదులుకుంటారా? అనే సందిగ్ధం నెలకొంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు దారులతోపాటు హాస్టళ్లకు, మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం ఇవ్వాలనే నిర్ణయానికి అనుగుణంగానే డిమాండ్‌కు తగ్గ సన్నబియ్యం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసే పరిస్థితి ఉంది. దీనిని అధిగమించేందుకు రైతులు సన్నాలు సాగు వైపు మళ్లేందుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించారు.



జిల్లాలో భూగర్భ జలాలు పెరగడం ద్వారా కాళేశ్వరం జలాలతో వరి సాగు పెరుగుతూ వచ్చింది. ఈ సారి మాత్రం వర్షాధారం పైనే ఆధారపడాల్సి వస్తుందని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు వానాకాలం, యాసంగి సీజన్‌లలో సుమారుగా 3.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దొడ్డురకం వడ్లనే దిగుమతి చేస్తున్నారు. ఈపరిస్థితుల్లో సన్నరకం వడ్ల వైపు మొగ్గుచూపుతారా? అనేది చర్చనీయాంశంగానే మారింది.

వానాకాలంలో 1.83 లక్షల ఎకరాల్లో వరి

జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 35 వేల 866 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. ఇందులో వరి లక్షా 83వేల 80 ఎకరాలు, పత్తి 49,215, పెసర 348, కందులు 1502, మొక్కజొన్న 1510, సోయా చిక్కుడు 5, ఎర్ర మిర్చి 180, మినుములు 10, జొన్నలు 10, ఆముదం ఆరు ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. ఇందుకోసం వరి 45,770 క్వింటాళ్ల విత్తనాలు, అవస రం అవుతాయని అంచనాలు వేయగా కందులు 45. 06 క్వింటాళ్లు, మొక్కజొన్న 120 క్వింటాళ్లు, పత్తి 665 క్వింటాళ్లు, సోయాచిక్కుడు 1.50 క్వింటాళ్లు, మిర్చి విత్తనాలు 18 కిలోలు, పెసర్లు 27.84 క్వింటాళ్లు, మినుములు 80 కిలోలు, జొన్నలు 40 కిలోలు అవసరం అవుతాయని అంచనాలు వేశారు. వానాకాలంలో ఎరువులు 49,441 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనా వేశారు. యూరియా 22,484 మెట్రిక్ టన్నులు, డీఏపీ 4328 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 14,839 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 5936 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1855 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని అంచనా వేశారు.

దిగుబడి తగ్గినా రాబడి ఎక్కువే

దొడ్డురకాల సాగుతో పోలిస్తే వరి సన్నా ల దిగుబడి తక్కువగా ఉంటుంది. దొడ్డురకాలు సగటున ఎకరానికి 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. అంతేకాకుండా కొంత ఇబ్బంది లేకుండా దిగుబడి ఉంటుంది. సన్నరకాల సాగులో ఎకరానికి 3 నుంచి 5 క్వింటాళ్ల వరకు దిగుబడి తక్కువగా ఉంటుంది. తెగుళ్ల బెడద ఎక్కువగానే ఉన్నా సన్న రకాలకు బహిరంగ మార్కెట్‌లోనూ ధర అధికంగానే ఉంటుంది. దొడ్డురకం క్వింటాల్‌కు రూ.1850 ఉండే సన్నరకాలు .2500వరకు మార్కెట్‌లో కొనుగోళ్లు జరుగుతాయి. అంతేకాకుండా నేరుగా రైతుల వద్దకే మిల్లర్లు వచ్చి కొనుగోళ్లు చేస్తారు. జిల్లాలో అనుకూలమైన సాగు పరిస్థితులు లేకపోవడం, కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండడంతో దొడ్డురకం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు.

దోస్తీమీట్-2024 మండల స్థాయి క్రీడలు

ముస్తాబాద్, మే 22:ముస్తాబాద్‌లో మండల స్థాయి క్రీడా పోటీలను గురువారం ప్రారంభించినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో దోస్తీ మీట్ 2024 మండల స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్ పోటీలలో ఆసక్తి ఉన్న యువకులు జట్ల వివరాలను పోలీసు స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

తంగళ్లపల్లిలో..

తంగళ్లపల్లి: జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఈ నెల 23 నుంచి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని లారీ అసోసియేషన్ ఎదుట మైదానంలో 23వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కబడ్డీ వాలీబాల్ జట్లు మైదానంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

క్రీడాకారుడికి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

వేములవాడ రూరల్, మే 22: మలేషియా నిర్వహించిన షష్టోబాల్ టోర్నమెంట్‌లో ఇండియా తరపున ఆడి గోల్డ్ మెడల్ సాధించిన చెక్కపల్లికి చెందిన ఎడపల్లి అనిల్‌కు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. బుధవారం శంశాబాద్ ఎయిర్‌పోర్టుకు క్రీడాకారులు, గ్రామస్థులు తరలివెళ్లారు. అనంతరం అనిల్‌ను సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

ఇల్లంతకుంట, మే 22: ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు ధాన్యానికి రూ.500 బోనస్ అని హామీ ఇచ్చిందని, ఇప్పుడు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తర్వాత సన్నవడ్లకు మాత్రమేనని ప్రకటించడం కాంగ్రెస్ వైఖరికి నిదర్శనన్నారు. అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పల్లెల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలి

ఎల్లారెడ్డిపేట, మే 22: వర్షాకాలం వస్తుండడంతో పల్లెల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గుండారం, బాకురుపల్లితండా గ్రామాల్లో బుధవారం పర్యటించారు. గుండారంలోని ప్రభుత్వ పాఠశాలలోని అమ్మ ఆదర్శ పనులను పరిశీలించారు. మురుగు కాలువలు, రోడ్డుకిరువైపుల పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. తాగునీటి ట్యాంకుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లె ప్రకృతి వనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, మొక్కల పెంపకం, పాఠశాలలు, కుల సంఘ భవనాల్లో చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. ప్రతీ గురువారం ప్లాస్టిక్‌ను తొలగించి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. శుక్రవారం డ్రైడేను నిర్వహించాలని, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లను సమన్వయ పరిచి ప్రదర్శనలు చేపట్టాలని సూచించారు. వ్యాధుల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు వంద శాతం బతికేలా కాపాడాలన్నారు. ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. తడి చెత్తతో కంపోస్టు ఎరువును తయారు చేసి ఆదాయాన్ని సమకూర్చాలన్నారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో సత్తయ్య ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో వజీర్‌అహ్మద్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్తయ్య

పాలీసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించాలి



విద్యార్థులతో నిర్వాహకులు, ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, మే 22 : పాలీసెట్‌లో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను సాధించాలని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్లను సాధించాలని పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల పున్నం చందర్ కోరారు. సిరిసిల్ల పట్టణం శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోపా ఆధ్వర్యంలో విద్యార్థులకు పాలీసెట్ ఉచిత కోచింగ్ నిర్వహించారు. బుధవారం కోచింగ్ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను సాధించాలని సూచించారు. పోపా ద్వారా ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ అందించిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. 45 రోజులపాటు శిక్షణను 25 మంది విషయ నిపుణులతో ఉచితంగా నిర్వహించడం పోపాకు గర్వకారణంగా నిలుస్తుందన్నారు. మండల విద్యాధికారి దూస రఘుపతి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ఉపాధ్యాయ బృందం స్వచ్ఛందంగా బోధించేందుకు ముందుకురావడం గొప్ప విషమన్నారు. ఈ నెల 24వ తేదీన జరిగే పాలిటెక్నిక్ పరీక్షను విద్యార్థులు ఆందోళనకు గురవకుండా ప్రశాంతంగా రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోపా సభ్యులు గాజుల ప్రతాప్, కోర్సు డైరెక్టర్ మచ్చ ఆనంద్, సభ్యులు వాసాల హరిప్రసాద్, ఆడెపు వేణు, మామిడాల భూపతి, బైరి రవీందర్, సామల తిరుపతి, కొంపెల్లి కృష్ణసాయి, కోడం పూర్ణిమ, బైరి రమాదేవి, కనుకుంట్ల తిరుమల, జక్కనీ నవీన్, శ్రీపతి శ్రీనివాస్, భూమేష్, బూర భాస్కర్, తాటిపాముల భాస్కర్, జక్కని శ్రీనివాస్, బండారిశ్రీనివాస్, ఉషకోల మనోహర్, అంకారపు జ్ఞానోభ, కొక్కుల శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, కారంపూరిరాజేశం, వద్నాల శ్రీనివాస్, ఇప్పకాయల ప్రకాష్, గుండెల్లి రవీందర్, లకుం సదానందం, చేరాల తిరుపతి పాల్గొన్నారు.

● వలస పక్షుల సందడి



కొత్తపల్లి చెరువు వద్ద వలస పక్షులు

గంభీరావుపేట, మే 22 : గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామ సమీప చెరువులో వలస పక్షులు సందడి చేస్తున్నాయి. తెలుపు నలుపు రంగులో ఉండే ఈ పక్షులు ఏటా అతిథిగా ఇక్కడికి వచ్చి పోతుంటాయని గ్రామస్థులు చెబుతున్నారు. వందలాది సంఖ్యలో ఈ వలస పక్షలు కొత్తపల్లి చెరువు వద్ద సందడి చేయడం స్థానికులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

పగుళ్లు చూపిన పంచాయతీ భవనం



మంగళపల్లె గ్రామపంచాయతీ భవనం

కోనరావుపేట, మే 22: మండ లంలోని మంగళపల్లె గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించిన మూడేళ్లకే గోడలు నెర్రెలు బారు తున్నాయి. కోనరావుపేట మండలం మంగళపల్లె సుమారు ఆరు సంవ త్సరాల క్రితం గ్రామ పంచాయతీ భవనం మంజూరైంది. పనులు పూర్తి చేసి సదరు కాంట్రాక్టర్ భవనాన్ని అప్పగించారు. ప్రారంభించిన మూడేళ్లకే గోడలు పగుళ్లు చూపాయి. గ్రామపంచాయతీ భవనంలో వసతులు లేక పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం రూం పగుళ్లు చూపి గోడ కూలిపోయే పరిస్థితికి వచ్చిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పగుళ్లు చూపిన గోడకు మరమ్మతు చేయాలని, లేకుంటే కూలిపోయే పరిస్థితి ఉందని ఆరోపిస్తున్నారు.



నెర్రెలు బాసిన భవనం

సహకార పోరు షురూ

- ఎన్నికల నోటిఫికేషన్ వెల్లడించిన అధికారి రామకృష్ణ
- 12 డివిజన్లు, 6177మంది ఓటర్లు
- రెండు స్థానాలు మహిళలకు
- ఒక స్థానం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్ - 9 జనరల్ స్థానాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల సమరం మొదలైంది. బుధవారం బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల అధికారి రామకృష్ణ ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేశారు. దీంతో జిల్లా కేంద్రంలో అర్బన్ బ్యాంక్ ఎన్నికల కోలాహలం నెలకొంది. అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి 12 స్థానాలుగా విభజించి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇందులో 9 జనరల్, రెండు మహిళలకు, ఒకటి ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్ చేశారు. 1, 2, 3, 4, 6, 8, 9, 11, 12 డివిజన్లు జనరల్ అభ్యర్థులకు కేటాయించారు. 5వ డివిజన్ ఎస్సీ, ఎస్టీలకు, 7, 10 రెండు స్థానాలు మహిళలకు రిజర్వ్ చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు. నామినేషన్లను ఈ నెల 27 నుంచి 29 వరకు స్వీకరించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి 3 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంది. 30న నామినేషన్ల పరిశీలన, 31న ఉపసంహరణకు అవకాశం ఇచ్చారు. జూన్ 6న పోలింగ్, ఉదయం 7 గంటల నుంచి 2 గంటల వరకు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. నామినేషన్ రుసుము, ఇతరులకు రూ.4 వేలు, బీసీలకు రూ.2 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ. 1000 చొప్పున నిర్ణయించారు. అర్బన్ బ్యాంక్ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను నిలబెట్టి పాలకవర్గాన్ని చేజిక్కించుకునే ప్రయత్నాలు మొదలు పెట్టాయి. దీనికి అనుగుణంగా ఇప్పటికే సమావేశాలు నిర్వహించారు.



నోటిఫికేషన్ జారీ చేస్తున్న ఎన్నికల అధికారి

12 డివిజన్లలో 6177 మంది ఓటర్లు

అర్బన్ బ్యాంక్ పరిధిలో 12 డివిజన్లను ఏర్పాటు చేయగా 6177 మంది ఓటర్లు ఉన్నారు. ప్రతీ డివిజన్‌లో 514 మంది ఓటర్లు ఉండే విధంగా విభజించారు. 12వ డివిజన్‌లో మాత్రం 523 మంది ఉన్నారు.

సంపద వనాల పరిశీలన



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

బోయినపల్లి, మే 22 : బోయినపల్లి మండలం నీలోజిపల్లి, కొదురుపాక గ్రామాలోని దశాబ్ది సంపద వనాలను జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ బుధవారం పరిశీలించారు. నీలోజిపల్లిలో సంపదమనం చుట్టూ వేసినటువంటి ఫెన్సింగ్ సంబంధించిన బిల్లులు చెల్లించాల్సి ఉండడంతో ఫెన్సింగు ఏర్పాటును పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి సంపద వనాల్లోని మొక్కల వివరాలను తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ పుష్పలత, పీఆర్ఏఈ విష్ణువర్ధన్ ఉన్నారు.

10లోగా విద్యార్థులకు యూనిఫాం అందించాలి



యూనిఫాం ప్రదర్శిస్తున్న డీఆర్‌డీవో శేషాద్రి

ఎల్లారెడ్డిపేట, మే 22: జూన్ 10 వరకు విద్యార్థులకు యూనిఫాం అందించాలని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల కుట్టు యూనిట్ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరఫరా చేసేందుకు దుస్తుల తయారీని వేగవంతం చేశామన్నారు. మండలంలో 4500 మంది విద్యార్థులకు అందించాల్సి ఉందన్నారు. వివిధ కొలతల్లో నాణ్యమైన దుస్తులను తయారు చేయాలన్నారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సీసీ లుమంగ్యానాయక్, నాగరాజు, దేవేందర్, రమణ, సుదర్శన్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో అధ్యాపకుల ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట, మే 22: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, గొల్లపల్లి, దుమాల గ్రామాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు బుధవారం ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థుల వద్దకు వెళ్లి సర్కారు కళాశాలలో చేరాలని అవగాహన కల్పించారు. ఆధునిక వసతులతోపాటు నాణ్యమైన విద్య అందుతోందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని, వారి ఉన్నతికి పాటు పడాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యంతో చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో జీలుగు విత్తనాలు

ఇల్లంతకుంట, మే 22: రైతులకు అందుబాటులో జీలుగు విత్తనాలు ఉన్నాయని ఇల్లంతకుంట వ్యవసాయ సహకార సంఘం సీఈవో చిట్టి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 30కిలోల బస్తాకు రూ.1120 ధర ఉంటుందని, వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి టోకెన్ తీసుకొని ఇల్లంతకుంట, పెద్దలింగాపూర్ గ్రామాలలోని గోదాముల్లో జీలుగు బస్తాలు పొందవచ్చని పేర్కొన్నారు.

జేఎన్‌టీయూహెచ్ ప్రిన్సిపాల్‌గా వేణుగోపాల్

వేములవాడ టౌన్, మే 22 : వేములవాడ మండలం అగ్రహారం జేఎన్‌టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వేణుగోపాల్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. వేణుగోపాల్ ఇంతకు ముందు జగిత్యాల జేఎన్‌టీ యూహెచ్ వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించారు. అగ్రహారం కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా పదవీ బాధ్యతలను బుధవారం చేపట్టినట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

చందుర్తి, మే 22: మండలం మల్యాల గ్రామంలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిటుకు లచ్చయ్య అనే వ్యక్తి భార్యతో కలిసి ఉదయం పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం లచ్చయ్య ఇంట్లో నుండి ఒక్కసారి మంటలు వచ్చాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే లచ్చయ్యకు సమాచారం అందించారు. గ్రామస్తుల సహాయంతో మంటలు ఆర్పారు. ఇంట్లో నిల్వ ఉంచిన ధాన్యం, మొక్కజొన్న, బియ్యం, ఇతర సామాగ్రి మంటల్లో కాలిపోయాయి. దాదాపు రెండు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఇంట్లోని వాషింగ్ మిషన్ ద్వారా మంటలు వ్యాపించినట్లు పేర్కొన్నారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వృద్ధురాలి అదృశ్యం

హుజూరాబాద్‌రూరల్, మే 22: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన నేరేళ్ల లక్ష్మీ రెండు రోజుల నుంచి కనింపించడం లేదు. కుటుంబస భ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జగిత్యాల టౌన్, మే 22: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎలుకబావి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. తులసీ నగర్‌కు చెందిన పల్లికొండ రాజయ్య(60) అనే వృద్ధుడు ఇంటి ముందు నిలబడి ఉండగా ఓ బాలుడు మిని వ్యాన్‌ను అజాగ్రత్తగా నడుపుతూ రాజయ్యను బలంగా ఢీ కొట్టాడు. దీంతో రాజయ్య అక్కడికక్కడే మృతి చెందగా పోచయ్య అనే వ్యక్తికి గాయాలు అయ్యాయి. రాజయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కోనరావుపేట, మే 22: కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని అరెస్టు చేసినట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పల్లిమక్త గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఆ ప్రాంతానికి వెళ్లి పేకాట ఆడుతున్న జిన్న బాబు, మోకనపల్లి రాంబాబు, ఎనగంటి రమేష్, మోకనపల్లి దేవరాజు, జాగిరి కిరణ్, అలిపిరి ఆనందం లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 2970 రూపాయలను 6 సెల్‌ఫోన్ లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రయాణికులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆర్టీసీ బస్సు డ్రైవర్

వేములవాడ టౌన్, మే 22: వేములవాడ ఆర్టీసీ బస్టాండులో బస్సును నిలిపి సుమారు 40 నిమిషాల పాటు డ్రైవర్ లేకపోవడంతో ప్రయాణికు లు ఇబ్బందలను ఎదుర్కొన్నారు. ఎపీ 29జెడ్1797 నంబర్‌గల ఆర్టీసీ బస్సును బస్టాండులోని నిలిపి వుంచడంతో ప్రయాణికులు పూర్తిగా నిండిపోయారు. సుమారు 40 నిమిషాలపాటు డ్రైవర్ రాకోవడంతో విసు గు చెందిన ప్రయాణికులు డ్రైవర్‌ను నిలదీశారు. దీంతో డ్రైవర్ ప్రయా ణికులపై అనుచిత వాఖ్యలు చేసినట్లు వేములవాడ పట్టణానికి చెందిన పిన్నింటి హన్మాండ్లు తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

ఎల్లారెడ్డిపేట, మే 22: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిష్టంపల్లి సమీపంలో వ్యవసాయ పొలాల్లో బుధవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పశుగ్రాసం దగ్గమైంది. సుమారు పది మంది రైతులకు చెందిన 50 ఎకరాల విస్తీర్ణంలోని గడ్డి పూర్తిగా కాలిపోయింది. రైతు నూకల శ్రీనివాస్ వ్యవసాయ పొలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు గాలికి ఒకదానికి ఒకటి రాపిడి జరిగే నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. మంటలు ఒక్కసారిగా పంట పొలాలను చుట్టుముట్టడంతో రైతులు చేరుకొని ఆరేందుకు ప్రయత్నించారు.

విద్యుత్ స్టార్టర్లు కరెంటు తీగలు సాగునీటి పైపులు పసుగ్రాసం పూర్తిగా కాలి బూడిద అయ్యాయి. సుమారు రూ లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పేర్కొన్నారు. వ్యవసాయ పొలాల్లో కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయాలని సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోలేదని వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కరెంటు తీగలను సరి చేయడంతో పాటు తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

కళతప్పిన సినారె కళామందిర్



కళావిహీనంగా మారిన సినారె కళామందిరం



పగిలిన సినారె కళామందిర్ కిటికీలు



చెత్తతో నిండిపోయి దర్శనమిస్తున్న కళామందిర్

- చెత్త బండ్లకు నిలయంగా మారిన వైనం
- నూతన భవనానికి మంజూరైన రూ. 5 కోట్లు
- నిధులు సరిపోవని ముందుకు రాని కాంట్రాక్టర్లు
- నూతన భవనాన్ని నిర్మించాలని కళాకారుల డిమాండ్

వేములవాడ టౌన్, మే 22: దేశ విదేశాల్లో ప్రఖ్యాతిగాంచిన విశ్వంభరుడు డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి(సినారే) స్వస్థలం అయిన వేములవాడలో ఏర్పాటు చేసిన సినారె కళామందిరం కళతప్పుతోంది. వేములవాడ ప్రాంతంలోని ఎంతో మంది కళాకారులను సినారే నిర్మించిన కళామందిర్ అక్కున చేర్చుకుంది. అయితే సినారె కళామందిర్ భవనాన్ని మండల పరిషత్ ఆధ్వర్యంలో ఎంపీడీవో మెంటనేన్స్‌ను చూస్తున్నారు. కొంతకాలంగా సినారే కళామందిర్ ఆలనపాలనా లేకపోవడంతో శిథిలావస్థకు చేరకుంది. వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని చెత్తను సేకరించే ఆటోలకు అడ్డాగా మారింది. సినారె కళామందిర్ చెత్తచెదారంతో నిండిపోయింది. వెంటిలేటర్లు పూర్తిగా పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో సినారె కళామందర్ వద్దకు వెళ్లగానే కంపు వాసన వస్తుందని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **నిధులు మంజూరైనా..**

సినారే కళామందిర్ నూతన భవనం నిర్మాణం చేపట్టేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేష్‌బాబు ఆధ్వర్యంలో టీయూఎఫ్ఐడీ నిధులు ఐదు కోట్ల రూపాయలు మంజూరైనట్లు ఆర్అండ్‌బీ ఏఈ సతీష్ తెలిపారు.

సినారె కళామందిర్ నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయలు ఏమాత్రం సరిపోవడం లేదని కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. సినారే కళామందిర్‌కు మంజూరైన నిధులను ఇతర అభివృద్ధి పనులకు మళ్లించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం టీయూఎఫ్ఐడీ నిధులను కొన్ని జిల్లాలో ప్రభుత్వం ఫ్రీజ్ చేసినట్లు తెలుస్తోంది. సినారె కళామందిర్‌కు సంబంధించిన నిధులు ఫ్రీజ్ చేశారా.. అలానే ఉన్నాయా.. అనే విషయం ఆర్అండ్‌బీ ఏఈని అడుగగా తనకు కూడా పూర్తి స్థాయిలో తెలియదని సమాధానమిచ్చారు.

● **నూతన భవనాన్ని నిర్మించాలి**

- మారం ప్రవీణ్ (పప్పి) కళాకారుడు, వేములవాడ



దేశ, విదేశాల్లో గుర్తింపు పొందిన మహోన్నత వ్యక్తి సినారే, దేశం మొత్తం సినారేను కీర్తిస్తే తన సొంత మండలమైన వేములవాడలో సినారె కళామందిర్ ఆలనపాలన నోచుకోకపోవడం సిగ్గు చేటు. గత ప్రభుత్వం హయాంలో ఐదు కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని సినారె కళామందిర్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దాలి.

● **సినారేతో అనుబంధం మరువలేనిది**

- గూడూరి నర్సన్, గజల్ కవి, వేములవాడ



సినారేతో తన అనుబంధం మరువలేనిది. తనతో సన్మానం పొందిన వాడిగా ఇప్పటికీ మర్చిపోను. వేములవాడలో సినారె కళామందిర్ కళతప్పడం బాధకరంగా ఉంది. సినారె కళామందిర్‌ను అద్భుతంగా నిర్మాణం చేసి గౌరవించాలి. ఈ ప్రాంత కళాకారులు సినారేను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించి సినారే కళామందిర్ నూతన భవనాన్ని త్వరగా నిర్మించాలి.

వైన్ షాపులో చోరీ



సీసీ ఫుటేజికి చిక్కిన అనుమానితుడు

ఓదెల, మే 22: మండల కేంద్రంలోని మల్లికార్జున బ్రాంది షాపులో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగుడు చోరికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి దాదాపు రెండు గంటల సమయంలో భవనం వెనుక ఉన్న తలుపులను తీసుకొని వైన్ షాపులోకి చొరబడ్డాడు. షాపులో వెతికిన అనంతరం కౌంటర్లో ఉన్న రూ.1.70 లక్షలను ఎత్తుకెళ్లాడు. అలాగే ఒక కవర్లో దాచిపెట్టిన మరో రూ.లక్ష దొంగ కంట పడకపోవడంతో వాటిని అక్కడే వదిలిపెట్టి కౌంటర్లో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లాడు. షాపు యజమాని కాసర్ల స్వామి ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై అశోక్ రెడ్డి, ఏఎస్ఐ రత్నాకర్, హెడ్ కానిస్టేబుళ్లు సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ నిర్వహించారు. అనంతరం సీసీ పుటేజీలను పరిశీలించగా దొంగగా అనుమానిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి పుటేజీలకు చిక్కాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అశోక్ రెడ్డి తెలిపారు.

సమస్యల వలయంలో పీహెచ్‌సీ

- సిబ్బంది కొరతతో రోగుల ఇక్కట్లు
- ఊరికి ఆమడ దూరంలో కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం



కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం

భగత్‌నగర్, మే 22: కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. సిబ్బంది కొరతతో రోగులకు సరైన వైద్యం అందని పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తపల్లి గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఆవిర్భవించినా ఆరోగ్య కేంద్రం పరిస్థితి తీరు మారడం లేదు. కొత్తపల్లి ప్రధాన రహదారి నుంచి మూడు కిలో మీటర్ల మేర లోపలికి వెళితే కాని రోగులకు ఆరోగ్యం అందని పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తపల్లి పట్టణంతో పాటు కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల నుంచి రోగులు ఆరోగ్య కేంద్రానికి చేరుకోవాలంటే ప్రత్యేకంగా ఆటోను తీసుకుపోవాలి లేదా సొంత వాహనంలోనే రావాల్సి ఉంటుంది. రోగి ఆరోగ్య కేంద్రానికి చేరుకునే సరికే ఉన్న రోగం కాస్త ముదిరే పరిస్థితులు ఉన్నాయి.

● **సిబ్బంది కొరత..**

కొత్తపల్లి ఆరోగ్య కేంద్రంలో ఉండాల్సిన ఇద్దరు మెడికల్ ఆఫీసర్లకు గాను ఒకరు ఆసిఫ్‌నగర్ మెడికల్ ఆఫీసర్ కాగా, ఒకరు నగరంలోని టీబీ ఆసుపత్రి నుంచి ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం కింద నాలుగు సబ్‌సెంటర్లు ఉండగా 8 మంది ఏఎన్ఎంలకు గాను రెండు ఖాళీలు ఉన్నాయి. ఒక స్టాఫ్‌నర్సుతో పాటు, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మేల్ సూపర్‌వైజర్ డిప్యూటేషన్‌లో ఉన్నారు.

● **పత్తాలేని ఆసిఫ్‌నగర్ ఆరోగ్య కేంద్రం నిర్మాణం..**

కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌కు ఆరోగ్యకేంద్రం మంజూరైనా నడిచేందుకు అనువైన పరిస్థితులు కల్పించడం లేదు. ఆసిఫ్‌నగర్‌లో ఆరోగ్య కేంద్రం భవనం లేక ఇక్కడున్న సిబ్బంది కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం నుండే విధులు నిర్వహించాల్సి వస్తున్నది. ఆసిఫ్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో ఇరువురు వైద్యులకు గాను ఒకరు మాత్రమే ఉన్నారు. ఆసిఫ్‌నగర్ ఆరోగ్య కేంద్రం కింద ఐదు సబ్‌సెంటర్లకు గాను ఆసిఫ్‌నగర్, ఎలగందల్, కమాన్‌పూర్, చింతకుంటలో పక్కా భవనాలు ఉన్నాయి. నాగుల మల్యాలలో పక్కా భవనం లేదు. ఒక హెచ్ఈఓ పోస్టు, కమాన్ పూర్‌లో ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఆసిఫ్‌నగర్‌లో ఉండాల్సిన ఫార్మసిస్టు ఒక రోజు వచ్చి డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. ఆసిఫ్‌నగర్‌లో ఉన్న గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న కూలీలను దృష్టిలో ఉంచుకొనైనా ఆ ప్రాంతంలో ఆరోగ్య కేంద్రాన్ని పక్కాగా నిర్మించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

ఫసల్ బీమా పథకంపై అవగాహన కల్పించాలి

- జాగ్రత్తగా పంటల వివరాలను నమోదు చేయాలి - కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మే 22: ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. పంటల బీమాతో రైతులకు ఎంతో ధీమా ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్‌లోని కేడీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారులు, ఉద్యానవన అధికారులు, ప్రోగ్రెసివ్ రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల వారీగా పంటల వివరాలను వ్యవసాయ అధికారులు జాగ్రత్తగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఫసల్ బీమా యోజన రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పంటలకు నష్టం జరిగినప్పుడు దీని ద్వారా పరిహారం అందుతుందని పేర్కొన్నారు. రైతులు బీమా చెల్లించే అవసరం లేదని, ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయని వివరించారు. అధికారులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులు ఆర్థిక అభివృద్ధి చెందేలా కృషి చేయాలని సూచించారు. ఫసల్ బీమా పథకంలో గ్రామం యూనిట్‌గా పరిగణిస్తారని చెప్పారు. పంట దిగుబడి ఆధారంగా, వాతావరణ పరిస్థితుల అనుగుణంగా బీమా నిర్ణయిస్తారని తెలిపారు. దీంతో జిల్లాలో ఎక్కువగా సన్న కారు, చిన్న కారు రైతులు ఉన్నారని, క్లస్టర్ అప్రోచ్ ద్వారా ఎక్కువ మంది రైతులు లాభపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయంలో అధునాతన పద్ధతులపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన జేడీఏ బాలునాయక్ ఫసల్ బీమా పథకంపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్లు మమత, ప్రతిభ, భూంరెడ్డి ఈ పథకంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా సీపీవోలు కొమురయ్య, పీబీ శ్రీనివాస్ పూర్ణచందర్రావు, షబానా సుల్తానా, ఉద్యానవనాధికారులు బి శ్రీనివాసు, జ్యోతి, ప్రతాప్ సింగ్, జగన్మోహన్ రెడ్డి, అయా జిల్లాల వ్యవసాయ అధికారులు బత్తుల శ్రీనివాస్, ఆదిరెడ్డి, భాస్కర్, వాణి పాల్గొన్నారు.

● **కేడీసీసీ బ్యాంకు సందర్శన**

కరీంనగర్‌లోని కేడీసీసీ బ్యాంకును కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం సందర్శించారు. సీఈవో సత్యనారాయణరావు, బ్యాంక్ అధికారులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. కేడీసీసీ బ్యాంకు, పీఏసీఎస్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు దేశంలోనే రోల్ మోడల్‌గా మారిందని సీఈవో కలెక్టర్‌కు వివరించారు. చొప్పదండి పీఏసీఎస్ దేశంలోనే అత్యుత్తమంగా నిలిచిందని పేర్కొన్నారు. జనరల్ మేనేజర్లు ప్రభాకర్‌రెడ్డి, ఉషశ్రీ, పీ ఏసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ రిసోర్స్‌పర్సన్ సత్యనారాయణ, డీజీఎంలు ఏజీఎంలు, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కూలీ మృతి

కోల్‌సిటీ, మే 22: గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పునాది బెడ్‌పై పడి గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన రావుల విజయ్(47) అనే వ్యక్తి మృతి చెందాడు. కూలీ పని చేసుకుంటూ జీవించే విజయ్ మంగళవారం రాత్రి ప్రభుత్వాసుపత్రిలో ఉన్న తన బంధువులను పరామర్శించేందుకు వెళ్లాడు. మూత్ర విసర్జనకు భవన నిర్మాణం వైపు వెళ్లగా చీకట్లో జారి ర్యాఫ్ట్ ఫౌండేషన్ బెడ్‌పై పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం నిర్మాణ కూలీలు విజయ్ మృతదేహాన్ని గుర్తించి సైట్ ఇన్‌చార్జికి సమాచారం ఇచ్చారు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ సౌజన్య ఘటన స్థలంలో విచారణ జరిపారు. మృతుని తల్లి రావుల జయశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్లు సీజ్

పెద్దపల్లి రూరల్, మే 22: జూలపల్లి మండలంలోని అల్లూరు చెరువు నుంచి టిప్పర్‌ల ద్వారా మండలంలోని రాఘవపూర్ ఇటుక బట్టీలకు టిప్పర్‌ల ద్వారా తరలిస్తుండగా తహసీల్దార్ రాజ్‌కుమార్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లకు అనుమతులు లేకపోవడంతో పాటు, వే బిల్‌లు లేవని దీంతో ఎనిమిది మట్టి టిప్పర్లను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. వారి వెంట ఆర్ఐలు నవీన్‌రావు, ఇంతియాజ్‌లతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా భూనీళా సమేత లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

- నాంపల్లి గుట్టపైన అంగరంగా వైభవంగా నిర్వహణ - భారీగా తరలివచ్చిన భక్తులు



ఉత్సవమూర్తులను కల్యాణవేదికకు తీసుకువస్తున్న అర్చకులు, అధికారులు



మంగళసూత్రాలను చూపిస్తున్న అర్చకులు



కల్యాణానికి హాజరైన భక్తులు

వేములవాడ టౌన్, మే 22: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి శ్రీభూనీళా సమేత లక్ష్మీనృసింహస్వామి వారి కళ్యాణాన్ని బుధవారం ఆలయ అర్చకులు, అధికారులు అంగరంగా వైభవోపేతంగా నిర్వహించారు. రాజన్న ఆలయ అర్చకులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో కన్యదాతలుగా రాచకొండ రామాచార్యులుసంధ్య రాణి ఆధ్వర్యంలో అర్చకులు విజయసింహచారి, రామకృష్ణచారి, హర్షవర్ధన్‌లు వేద మంత్రాలతో కళ్యాణతంతును కన్నుల పండువగా చేపట్టారు. నాంపల్లి గుట్టపైన కొలువుదీరిన శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం క్రింది భాగంలోని కళ్యాణ వేదికవద్దకు బాజాభజంత్రీలతో తీసుకువచ్చారు. ఊరేగింపు సమయంలో సేవాదారులు, భక్తుల నిర్వహించిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. స్వామి వారి కల్యాణంలో భాగంగా రాజన్న ఆలయ ఏఈవో బ్రమ్మన్నగారి శ్రీనివాస్ స్వామి వార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. కల్యాణమహోత్సవానికి నాంపల్లి గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, సూపరింటెండెంట్‌లు సరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్, నాంపల్లి గుట్ట ఆలయ ఇన్‌చార్జ్ నరేందర్ అధికారులు శ్రీనివాస్, మాధవరావుతో పాటు భక్తులు పాల్గొన్నారు.

నల్లగొండలో..

కొడిమ్యాల: మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నర్సింహస్వామి జయంతిని పురస్కరించుకొని బుధవారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాదం వితరణతో కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కమలాకర్, యాగ్నికుడు శ్రీనాథచార్యులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీకాంతాచార్యులు, మనోజ్‌కుమారాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీర్‌పూర్: బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కొండపైన ఉన్న లక్ష్మీ నరసింహుని ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించగా భక్తులు స్వామి వారిని దర్శించకున్నారు. సాయంత్రం స్థంబ ఆవిర్భావ పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, చైర్మన్ ఎనగంటి సామ్రాట్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య



రమేశ్ (ఫైల్)

సిరిసిల్ల క్రైం, మే 22: సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌కు చెందిన చింతోజు రమేశ్ (43) అనే ఎలక్ట్రికల్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం... బుధవారం ఉదయం రమేశ్ అనే ఎలక్ట్రికల్ వ్యాపారి షాప్ తెరిచి స్నేహితులను కలిసి ఇంటికి వెళ్లి ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. శివనగర్‌కు చెందిన రమేశ్ కోర్టుకు ఎదురుగా శ్రీరామ ఎలక్ట్రికల్ షాప్ నిర్వహిస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య కళ్యాణి, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కొంతకాలంగా షాప్ సరిగా నడవకపోవడంతో దాదాపు 20లక్షల రూపాయల వరకు అప్పులు పాలయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆస్తుల పంపకంలో తల్లిదండ్రులతో కలహాలు మొదలయ్యాయి. వారం క్రితం భార్య, పిల్లలు తల్లిగారింటికి వెళ్లారు. ఇళ్ల పంపకం విషయంలో కుటుంబసభ్యుల మధ్య గొడవలు ఏర్పడడంతో మనస్తాపం చెందిన రమేశ్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఎస్ఐ శ్రీనివాసరావు పరిశీలించి పంచనామా చేశారు. తన భర్త ఆత్మహత్యకు అత్త, మామలు, మరిదే కారణమని, తన పిల్లలకు ఆధారం చూపాలని భార్య కళ్యాణి వేడుకుంది. దీంతో రమేశ్ మృతదేహానికి పోస్టుమార్టం చేయడంలో జాప్యమైంది. చివరికి ఇళ్లు ఇవ్వ డానికి రమేశ్ తల్లిదండ్రులు అంగీకరించడంతో పోస్టుమార్టం అనంతరం రాత్రి అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఎలక్ట్రికల్ అండ్ హార్డ్‌వేర్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడడంతో వ్యాపారులు, స్నేహితులు, కుటుబసభ్యులు చేరుకొని విలపించడం కలిచివేసింది. భార్య కళ్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ఎండపల్లి, మే 22: మండలంలోని మారేడుపల్లి గ్రామానికి చెందిన తనుగుల రామయ్య(51) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మారేడుపల్లి గ్రామానికి చెందిన తనుగుల రామయ్య, అతడి భార్యతో కలిసి మూడు రోజుల క్రితం తన బిడ్డ ఇంటికి కుక్కలగూడూర్‌కి బైక్‌పై వెళుతుండగా పెద్దపెల్లి జిల్లా పాలకుర్తి మండలం వేంనూర్ గ్రామంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో తనుగుల రామయ్య, కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రాగంపేట గ్రామానికి చెందిన ధీకొండ మహేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. మహేందర్ మంగళవారం మృతి చెందగా, రామయ్య చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

మానకొండూర్, మే 22: మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన మల్యాల లక్ష్మయ్య అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాల పాలయ్యాడు. లక్ష్మయ్య ఎప్పటి లాగే కల్లు గీయడానికి బుధవారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి పోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

కొడిమ్యాల, మే 22: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన ఒంటెద్దు బాబు(50)అనే వ్యక్తి మంగళవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొడిమ్యాల హెడ్ కానిస్టే బుల్ అర్ష రాజు బుధవారం తెలిపారు. హెడ్ కానిస్టెబుల్ తెలిపిన వివరాల మేరకు హమాలి పని చేసుకొని జీవిస్తున్న బాబు కొంత కాలంగా తాగుడుకు బానిసై మంగళవారం ఉదయం కూలీ పనికి వెళ్లి తాగిన మైకంలో గుర్తు తెలియని క్రిమి సంహారక మందు తాగాడు. అతనిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుని భార్య ఒంటెద్దు పద్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రూ. 7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7450 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 24మంది రైతులు 326క్వింటాళ్ల విడి పత్తి, 16మంది రైతులు ఎనిమిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7450, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



ఖైరుద్దీన్(ఫైల్), రషీద్(ఫైల్)

మేడిపల్లి/మెట్‌పల్లి మే 22: జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహమ్మద్ రషీద్ (60) అతని తండ్రి ఖైరుద్దీన్(85) మృతి చెందారు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రిటైర్డ్ ఉద్యోగి ఖైరుద్దిన్ వృద్ధాప్యరీత్యా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా వైద్య పరీక్షల కోసం కొడుకు రషీద్ కారులో కరీంనగర్‌లోని ఆసుపత్రికి వెళ్లాడు. వైద్య పరీక్షల అనంతరం తిరిగి మెట్‌పల్లి బయలుదేరారు. ఈ క్రమంలో మేడిపల్లి మండలం సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రీకొడుకులు ఖైరుద్దిన్, రషీద్ అక్కడిక్కడే మృతి చెందారు. రషీద్ మెట్‌పల్లి మండలంలో ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తున్నాడు. మృతుడు రషీద్ భార్య నస్రీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై రవీందర్‌రావు తెలిపారు. మెట్‌పల్లి సీఐ నవీన్, కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ పంచనామా నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 22: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని ఓ పెట్రోలు బంక్ సమీపాన కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండల కేంద్రానికి చెందిన కట్టె కోత మిషన్ నిర్వాహకుడు సంతోష్ తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. సంతోష్ తన బైక్‌పై ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లికి వెపుకు వెళుతున్నాడు. అటు వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న మరో యువకుడు ఒక్కసారిగా పెట్రోల్ బంక్ వైపుకు మలుపడంతో ప్రమాదం జరిగింది. సంతోష్ చేయి విరగడంతో పాటు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు సస్పెన్షన్

చేర్యాల/సిరిసిల్ల క్రైం మే 22: రెండో వివాహం చేసుకున్నాడన్న ఆరోపణలపై కొమురవెల్లి ఎస్ నాగరాజుపై పోలీసుశాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటువేశారు. ఈమేరకు మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన ట్లు విశ్వసనీయంగా తెలిసింది. తనను వేధించడమే కాకుండా పిల్లలను తీసుకునివెళ్లి అందుబాటులో లేకుండాపోయాడని, ఇతర మహిళను రెండో వివాహం చేసుకున్నాడని పేర్కొంటూ ఎస్ఐ నాగరాజు భార్య మానస మంగళవారం రాత్రి కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి బంధువులతో కలిసి ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై సిద్దిపేట సీపీ అనూరాధ ఇచ్చిన నివేదిక మేరకు ఉన్నతాధికారులు ఎస్ఐ నాగరాజుతో పాటు ఈకేసులో భాగస్వామిగా ఉన్న ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 22: ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామంలోని లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పిల్లాపాపలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు. అనంతరం నాయకులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, బాలయ్య, శ్రీనివాస్‌రావు, లక్ష్మీనర్సు, వెంకట్‌రావు, బాలనర్సు, రాజేందర్, రాజునాయక్, నర్సయ్య కిషన్, నారాయణ, భాస్కర్‌జాదవ్ పాల్గొన్నారు.

ఆవు, దూడ విక్రయంపై గ్రామస్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

చందుర్తి, మే 22 : చందుర్తి మండలం నర్సింగాపూర్ మోహినికుంట మల్లికార్జునస్వామి ఆలయానికి చెందిన ఆవు, దూడను విక్రయించడంపై గ్రామస్థులు బుధవారం ఆందోళనకు దిగారు. ఆలయానికి భక్తులు ఇచ్చిన ఆవు, దూడను ఆలయ పూజారులు ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే కటికె వాళ్లకు విక్రయించారని ఆలయ కమిటీ సభ్యులు ఆరోపించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణ చేపట్టి ఆవు, దూడను తిరిగి ఆలయ కమిటీకి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఎస్సైని కోరారు.

క్రికెట్ కిట్ అందజేత



కిట్ అందజేస్తున్న కొండూరు గాంధీ

గంభీరావుపేట, మే 22 : గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌కాలనీలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, కరీంనగర్ పార్లమెంట్ కో ఇన్‌చార్జి కొండూరు గాంధీ పిల్లలకు బుధవారం క్రికెట్ కిట్ అందజేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. అంతకుముందు పిల్లలతో కొద్దిసేపు క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు.

మున్నూరుకాపు సంఘం
జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



దేవయ్య, శంకర్

వేములవాడ టౌన్, మే 22 : జిల్లా మున్నూరుకాపు సంఘం ఎన్నికలను వేములవాడ పట్టణంలో బుధవారం అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో ఎవరూ నామినేషన్ వేయక పోవడంతో జిల్లా అధ్యక్షుడిగా బొప్ప దేవయ్యను, ప్రధాన కార్యదర్శిగా పోంచెట్టి శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దొడ్డు రకాలకూ బోనస్ ఇవ్వాలి

కథలాపూర్, మే 22 : గత ఎన్నికల్లో అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్న రకాలకు మాత్రమే ప్రకటించి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అమలు చేసినట్టు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు కేవలం ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం మాత్రమే అమలు చేశారన్నారు. ఉపాధి కూలీలకు రూ.12 వేలు, రైతు భరోసా కింద రూ.15 వేలు, కౌలు రైతులకు రైతు భరోసా అందిస్తామని నమ్మించి మోసం చేశారని విమర్శించారు. గతంలో వ్యవసాయమే దండగ అన్న టీడీపీకి అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని అన్నారు. కల్లాల్లో వడ్లు పోసిన రైతాంగం నెలల తరబడి ఎదురు చూస్తున్నా కొనుగోళ్లలో జాప్యం చేయడం దారుణమన్నారు. గత బీఆర్ఎస్ సర్కారు మంజూరు చేసిన రోడ్లను ప్రభుత్వం ఇప్పటికీ పనులు పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ గుండారపు సౌజన్యగంగాధర్, జెల్ల వేణు, మాజీ ఎంపీపీ నాంపల్లి లింబాద్రి, కోఆప్షన్ సభ్యుడు రఫీ, ఎంజీ రెడ్డి, కల్లెడ శంకర్ తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ కూలీ అంత్యక్రియల్లో బీఆర్ఎస్ నేతలు

కోనరావుపేట, మే 22: కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో ఉపాధిహామీ కూలీ మారుపాక రాజవ్వ మట్టి పెళ్లలు మీద పడి మంగళవారం మృతి చెందింది. రాజవ్వ అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం కన్వీనర్ మంతెన సంతోష్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, వెంకట్రావుపేట ఎంపీటీసీ పల్లె మంజుల రవీందర్ రెడ్డి, సురేష్, రాజిరెడ్డి ఉన్నారు.

విద్యుత్తు చౌర్యం.. అధికారుల మౌనం

ఎల్లారెడ్డిపేట, మే 22: కరెంట్ సామర్థ్యానికి మించి వినియోగిస్తే కరెంటు సరఫరాలో లో-వోల్టేజీ సమస్య తలెత్తి విద్యుత్ పరికరాలు కాలిపోతాయి. నిత్యం కరెంటు సరఫరాలో అంతరాయంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ప్రాంతంలో ఓ వ్యక్తి దర్జాగా పట్టపగలే విద్యుత్ తీగలకు కొక్కాలు తగిలించి వినియోగించుకుంటున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. కరెంటు తీగలకు కొక్కాలు వేసి తన ఇంటి సమీపంలో రేకుల షెడ్డుకు విద్యుత్‌ను వినియోగించుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

చందుర్తి, మే 22 : చందుర్తి మండలం జోగాపూర్ ఎల్లమ్మ ఆలయ సమీపంలో బుధవారం కారు, బైకు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన బుర్ర గంగాధర్ గౌడ్ రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో గంగాధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం వేములవాడలోని ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

రూ. 2 కోట్లతో ఉడాయించిన పూజారి

వేములవాడ టౌన్, మే 22: వేములవాడ పట్టణానికి చెందిన ఓ పూజారి రూ. 2 కోట్లతో ఉడాయించినట్లు పట్టణంలో జోరుగా చర్చసాగుతోంది. పట్టణంలోని మార్కండేయనగర్‌లోని ఓ దేవాలయంలో అర్చకుడిగా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిసింది. పూజారి అధిక మొత్తంలో వడ్డీ ఇస్తానని చెప్పి పట్టణానికి చెందిన పలువురి వద్ద రూ. 2 కోట్లతో ఉడాయించినట్లు సమాచారం. పక్షం రోజులుగా ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో బాధితులు ఒక్కసారిగా కంగుతిన్నారని చర్చ సాగుతోంది.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

- ఆలయాలకు తరలివచ్చిన భక్తులు
- కన్నుల పండువగా స్వామివారల కల్యాణోత్సవం
- ప్రత్యేక పూజలు



జయంతి వేడుకల్లో భక్తులు



నిర్వహిస్తున్న అర్చకులు



జయంతి వేడుకల్లో భక్తులు

సిరిసిల్ల రూరల్, మే 22: జిల్లాలోని ఆలయాల్లో బుధవారం ఆధ్యాత్మికత వెల్లివెరిసింది. సిరిసిల్ల పట్టణంలో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నరసింహ జయంతి మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. సిరిసిల్ల ఇస్కాన్‌సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక కే కన్వెన్షన్ ఫంక్షన్‌హాల్‌లో ముందుగా హోమం, హరినామ సంకీర్తన, నరసింహ యజ్ఞం, హరికథ, మంగళహారతి వంటి కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఇస్కాన్ ఇన్‌చార్జి శ్రీమాన్ ప్రాణనాథ, అచ్యుతదాస, రాధాకృష్ణదాస, అంబదాస, కోడం అశోక్, ఊరడి ప్రభాకర్, మంగళారపు ప్రభాకర్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి:తంగళ్లపల్లి మండల కేంద్రంలో లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అభిషేకం, అలంకరణ, సుదర్శన హోమం వంటి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. వేలాది మంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా చౌడాలమ్మదేవి కల్యాణం

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో చౌడాలమ్మదేవి కల్యాణ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కొత్తపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో చౌడాలమ్మదేవి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా చౌడాలమ్మదేవి కల్యాణం నిర్వహించారు. మైల భోనం, పోచమ్మ బోనాలు, చౌడాలమ్మ బోనాల ఊరేగింపు చేపట్టారు. పుట్టకు ధని పోయడం, పుట్ట బంగారం తేవడం వంటివి కొనసాగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు. త

రేణుకా ఎల్లమ్మ సిద్దోగం

వేములవాడ టౌన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో బుధవారం రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గౌడ కులస్థుల ఆధ్వర్యంలో మంగళహారతులతో ఇంటి నుంచి డప్పుచప్పుళ్ల మధ్య బోనం తీసుకెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

అమ్మవారిని దర్శించుకున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

వేములవాడ మండలం రుద్రవరంలో నిర్వహించిన రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయానికి వచ్చిన ఆయనను గౌడ కులస్థులు సన్మానించారు. ఆయన వెంట పార్వతి వేణు, ఎంపీటీసీ ఆర్సీరావు నాయకులు తాడెం శ్రీనివాస్, రాజిరెడ్డి, హరికృష్ణ కట్ట శ్రీనివాస్, పచ్చిమట్ల శ్రీనివాస్, అలువాల పర్శరాములు, కట్ట తిరుపతి, బెజుగం మహేష్, కాసర్ల అరుణ్ తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

కోనరావుపేట: కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో బుధవారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, పట్టు వస్త్రాలను సమర్పించగా అర్చకులు కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో మాజీ సెస్ చైర్మన్ కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బీరప్ప ఉత్సవాలు

వేములవాడ రూరల్: ఫాజుల్‌నగర్ గ్రామంలో బీరప్ప ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం నాగవల్లి కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ జక్కుల కవిత, పార్టీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి నాయకులు ఉన్నారు.



కొత్తపల్లిలో చౌడాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



బీరప్ప ఉత్సవంలో బీజేపీ నాయకులు

కార్మికుల కష్టాలు తెలుసుకునేందుకు దుబాయి పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న సంఘస్వామి

వేములవాడ టౌన్, మే 22: గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకునేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దుబాయి వెళ్లారని డీసీసీ ఉపాధ్యక్షుడు సంఘస్వామి యాదవ్ స్పష్టం చేశారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల కష్టాలను గాలికి వదిలి దుబాయి వెళ్లారని బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీసీ బిడ్డ ఆది శ్రీనివాస్ విదేశాలకు వెళ్తే ఓర్వలేకపోతున్నారని, బీఆర్ఎస్ నాయకులు రైతులకు చేసింది ఏమీలేదని అన్నారు. ఆది శ్రీనివాస్ ఎక్కడున్న ప్రజాసమస్యలపైనే పోరాడుతారని, దుబాయి వెళ్లింది కూడా గల్ఫ్ కార్మికుల సమస్యలపైనేనని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని బీఆర్ఎస్ నేతలకు హితవుపలికారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో గల్ఫ్‌కార్మికుల కోసం చేసింది ఏమీలేదని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో తిరగలేక ముఖం చాటేసుకొని ఉన్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు విమర్శించడం సిగ్గుచేటని, తమ నేతను విమర్శించే హక్కు లేదని మండిపడ్డారు. నియోజకవర్గానికి దూరంగా ఉంటూ అమవాస్య, పౌర్ణమికి వచ్చిపోతున్న వారు ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. అలాంటి పారచ్యూట్ నాయకులు మాట్లాడడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని హేళన చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రుణమాఫీ చేస్తే ఆయన స్ఫూర్తితో ఈ రోజు ప్రజాపాలనలో కాంగ్రెస్ రైతులకు రుణమాఫీ చేసేందుకు సిద్ధమవుతోందని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం పరితపించే తమ నాయకులపై బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బండ శ్రీనివాస్, నాగుల నర్సయ్య కనికరపు రాకేష్, చందు తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పెగడపల్లి, మే 22 : రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్ర త్యేక కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తూ, పంటలు విరివిగా పం డా లని, ప్రజలు సుభిక్షంగా ఉండేలా దీవించాలని కోరుతూ బీరప్ప దేవుడిని వేడుకున్నారు. బుధవారం మండలంలోని మద్దులపల్లి, నంచర్ల గ్రామాలలో బీరప్ప పట్నాలు ఉత్సవాలలో భాగంగా కళ్యాణోత్సవ వేడుకలలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొ క్కులు చెల్లించుకున్నారు. ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరుకు శా యశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, నాయకులు ఒరుగల శ్రీనివాస్, తాటిపర్తి శోభారాణి, అరిక ట్ల సంజీవ్, మిట్టపల్లి రమేష్ రెడ్డి, బోడపట్ల బీరయ్య, సత్యనారాయణ రెడ్డి, అనీల్ గౌడ్, బలరాంరెడ్డి, సంధి మల్లారెడ్డి, చాట్ల భాస్కర్, కడారి తిరుపతి, కిషన్, రాజేందర్, వంశీదర్ రావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



కోనరావుపేట ప్రధాన రహదారి కల్వర్టు

కోనరావుపేట, మే 22 : కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. సిరిసిల్ల నుంచి కోనరావుపేట వెళ్లే ప్రధాన రహదారి కోనరావుపేట మండల కేంద్రానికి సమీపంలో ఒర్రెపై నిర్మించిన కల్వర్టు కొన్నేళ్ల క్రితం నిర్మించారు. వరద తాకిడికి కొట్టుకపోయి గుంతలుగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టు తొమ్మిదో ప్యాకేజీలో భాగంగా నిర్మించిన మల్కపేట రిజర్వాయర్ నుంచి సీ పేజీ నీరు ఒర్రె మార్గం ద్వారా సంవత్సర కాలంగా పారుతోంది. ఈ నీరుతో పాటు వర్షాకాలంలో వచ్చే నీరు తాకిడి ఎక్కువ కావడంతో ప్రధాన రహదారి కల్వర్టు కొట్టుకుపోయి గుంతల మయంగా మారింది. కల్వర్టు మీదుగా నీరు ప్రవహించడంతో గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రతినిత్యం నీరు ప్రవహిస్తుంది కాబట్టి శాశ్వత పరిష్కారం కోసం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

కన్నుల పండువగా కల్యాణ మహోత్సవం

కోరుట్ల, మే 22 : పట్టణంలోని రవీంద్ర రోడ్డులోని లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్విహించారు. వేదపండితులు పాలెపు రాము, వినయ్ శర్మ మంత్రోచ్ఛరణ మధ్య సాగింది. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వేదపండితులు అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. లక్ష్మీ నరసింహ ఉత్సవ మూర్తులతో శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్రను మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలుకగా కాలనీ వాసులు రహదారి నీటితో శుభ్రపరిచారు. అనంతరం ప్రత్యేక వేదికపై లక్ష్మీ నరిసింహ స్వామి కళ్యాణంను నిర్వహించారు. దేవాలయ నిర్వహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించంగా భక్తులు మొక్కులు చెల్లించుకోని అన్న ప్రదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వహకులు జుంబర్తి రమేష్, ఎల్లా మహేష్, జుండర్తి నరేందర్ పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

ధర్మపురి, మే 22: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం సుదూర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. నవ దంపతులు గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కుబేరుడిని దర్శనం చేసుకున్నారు. అలాగే హనుమాన్ దీక్షాపరులు ప్రసన్నాజంనేయ ఆంజనేయ, రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు ప్రదక్షిణాలు చేశారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి గీతా పారాయణం

మల్లాపూర్, మే, 22 : మండలంలో నిర్వహించే గీతా పారాయణ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని లయన్స్ క్లబ్ రీజీయన్ కార్యదర్శి శివ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వాసవి మాత కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈనెల 25 నుంచి జూన్ 5వ తేది వరకు సాయంత్రం 6:30గంటలకు గీత పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. గీతా పారాయణం కార్యాక్రమాన్ని ఉత్తమ గీత ప్రబోధక్ చిలమంతుల చత్రపతి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు, కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని గీత సారంశాన్ని తెలుసుకోని మానవుని పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి బీజం వేసి ఆధ్యాత్మిక జ్ఞాన్నాని పొందలన్నారు. నాయకులు రుద్ర లక్ష్మీరాజం, శివరామ కిషన్, ముద్దం సత్యనారాయణగౌడ్, రుద్ర రాంప్రసాద్, క్యాతం సురేష్‌రెడ్డి, ఎలాల సత్యనారాయణరెడ్డి, రవి, రాకేష్ పాల్గొన్నారు.

వేములవాడ బస్సులు రాక ఇక్కట్లు

● నాలుగేళ్లుగా పూడూరుకు నిలిపివేత ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు
●పట్టించుకోని అధికారులు



పూడూర్ బస్టాండ్

కొడిమ్యాల, మే 20 : మండలంలోని పూడూర్ గ్రామానికి సుమారు నాలుగేళ్లుగా ఆర్టీసీ అధికారులు వేములవాడ బస్సులను నడపక పోవటంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ప్రజలు పలుమార్లు మొరపె ట్టుకున్న ఫలితం లేదని పూడూర్ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ డిపోకు చెందిన బస్సులు మండలంలోని చె ప్యాల, కొడిమ్యాల, పూడూర్ మీదుగా జగిత్యాలకు వెళ్లటంతో పూడూర్, నమిళికొండ, అప్పారావుపేట. గౌరాపూర్, నర్సింహులపల్లి, గోపాల్‌రావుపేట, ఆరెపల్లి గ్రామాల ప్రజలకు, రాకపోకలు సాగించు వివిధ శాఖల అధికారులకు మండల కేంద్రమైన కొడిమ్యాలకు రావాలన్నా, వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి వెళ్లాలన్నా సౌకర్యంగా ఉండేది. గతంలో జగిత్యాల నుంచి బయలు దేరిన వేములవాడ బస్సు పూడూర్ నుంచి కొడిమ్యాల, చెప్యాల మీదుగా వేములవాడకు వెళ్లటంతో ఈ 7 గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉండేది. సుమారు నాలుగేళ్లుగా వేములవాడ డిపో బస్సులను పూడూర్ మీదుగా కాకుండా మండలంలోని నాచుపల్లి గ్రామం నుంచి నడపటంతో తాము ఇబ్బందుల పాలవుతున్నామని పూడూర్ గ్రా మస్థులు తెలిపారు. పూడూర్ నుంచి చెప్యాల క్రాస్ రోడ్డు వరకు ఆటోలో రావాలంటే 20 రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. అక్కడ నుంచి వేములవాడకు వెళ్లేందుకు బస్సు చార్జీలు 30 రూపాయలు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. గతంలో పూడూర్ నుంచి ఒక్కరు 30 రూపాయలు చెల్లిస్తే వేములవాడకు చేరుకునే వారమన్నారు. ఇప్పుడు అదనంగా ఒక్కరికి 20 రూపాయలతో పాటు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ఆర్టీసీ అధికారులు మూడు బస్సులను నాచుపల్లి నుంచి, మరో రెండు లేదా మూడు బస్సులను పూడూర్ నుంచి వేములవాడకు నడపాలని ప్రజలు కోరుతున్నారు. పూడూర్‌కు వేములవాడ బస్సులను ఆర్టీసీ అధికారులు నడిపించే విధంగా చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం కృషి చేయా లని పూడూర్ గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్. మురళీకృష్ణను వివరణ కోరగా కొత్తగా టెండర్లు జరిగినప్పుడు వేములవాడ నుంచి పూడూర్‌కు బస్సులు నడపటానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పూడూర్‌కు వేములవాడ బస్సులు నడుపాలి

కడారి మల్లేశం, కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి



మండలంలోని పూడూర్ గ్రామానికి వేములవాడ నుంచి ఆర్టీసీ బస్సులు నడుపకపోవటంతో ప్రజలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు మండలంలోని చెప్యాల, కొడిమ్యాల, పూడూర్ మీదుగా జగిత్యాల వరకు, జగిత్యాల నుంచి పూడూర్, కొడిమ్యాల, చెప్యాల మీదుగా వేములవాడ వరకు బస్సులను నడుపాలి.